


నేను అప్పుడు శాంతినికేతన్‌లో బి. ఎ. (ఆనర్స్) ఫైనల్ చదువుతున్నాను. దుర్గ పూజలకు సెలవులిచ్చారు. విద్యార్థులంతా హాస్టల్లు ఖాళీచేసి ఇళ్ళు కెళుతున్నారు. ఈ పండగంటే బెంగాలీలకు చాలా యిష్టం. బోల్‌పూర్ టౌనులోని రిక్షాలన్నీ చీమల బారుల్లా శాంతినికేతన్ చేరుకుంటున్నాయి. బోల్‌పూర్ టౌన్‌కూ ఆశ్రమానికీ దాదాపు రెండుమైళ్ళ దూరం వుంటుంది. కొందరు పాటలు పాడుకుంటూ, మరికొందరు ఈలలు వేసుకుంటూ మా రిక్షా ముందంటే, మా రిక్షా ముందంటూ పోటీ పడుతున్నారు. అమ్మాయిలు వెండిన రిక్షాలే ఎక్కువున్నాయి. అందువల్ల రిక్షా తొక్కేవారిలో కూడా హుషారు ఎక్కువైంది. వరుసగా వెళ్ళే

ఈ రిక్షాలను చూసి, దారిన వెళ్ళే వారంతా,రిక్షాపందాలు జరుగుతున్నాయా! అనుకుని నవ్వుకుంటున్నారు. దారిలో ఒంటరిగా నిలబడ్డ నేను వెళ్ళేవారికి చిన్న పిల్లాడిలా 'టాటా' చెబుతున్నాను.

"కీరే? బాడీ జాబేనా?" (నీవు యింటికి వెళ్ళవా?)

"ఎక్ లే ఎఖనే కి కొర్ బే?" (ఒంటరిగా యిక్కడ ఏం చేస్తావ్?)

"ఛీఛీ! తుమీతొ విచిత్రొ ఛేలే! ఎక్లా తుమాకె ఖాలో లగేనా!" (ఛీఛీ! నీవేం మనిషివి? ఒంటరిగా నీకేం బాగుంటుంది?)

"ఆమార్ షొంగె అష్‌బెనాకెనో?" (పోనీ మా వెంటయినా రాకూడదూ?)

"జొదీ మన్ నా లగే, కోల్‌కతా అష్‌బేగ్!" (కలకత్తా దగ్గరేగా! బోర్ కొడితే బండెక్కేసేయ్!)

"అచ్ఛా! అమీజాచ్ఛి!" (సరే, మే మెళతాం!)

రిక్షాల్లో వెళుతూ, నాకు తెలిసిన స్నేహితులూ, క్లాస్‌మేట్స్ యిందులో అమ్మాయిలు కూడా వున్నారు. నా పట్ల సానుభూతితో అన్న మాటలు వింటూంటే, అనుకోకుండానే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వారితో పాటే నేను 'సెండాఫ్' యివ్వటానికి స్టేషన్ చేరుకున్నాను. అప్పటికే ఆకాశమంతా బాగా మబ్బు పట్టింది. భాగల్‌పూర్ (బిహార్) నుండి కలకత్తా వైపు వెళ్ళే బండికోసం అందరూ ఎదురుచూస్తున్నారు. స్టేషన్ నుండి తిరుగుముఖం పట్టేసరికి బాగా చీకటి పడింది.

వాన చినుకులతో పాటు, దట్టమైన చీకటి కరిగి, భూమ్మీద కురుస్తోంది. అక్కడక్కడా ఎలక్ట్రికల్ స్తంభాల కాంతిలో రెక్కల పురుగులు, గుంపులు గుంపులుగా ఎగురుతూ వున్నాయి. దారికిరువైపులున్న, రసగుల్లా, సమోసా, బట్టల, కిరాణా షాపుల నిండా మనుషులు నిండిపోయారు - రెక్కల పురుగుల్లాగే. విసురుగా పడుతున్న లావైన వాన చినుకులకు రెక్కలు విరిగిన పురుగులు భూమ్మీది బురదలో విలవిల కొట్టుకుంటున్నాయి. విసుక్కుంటూ దారి మలుపు తిరిగాను. కొద్దిదూరంలో కొత్త బంగళాలు కట్టారు. అన్నీ కొత్తవే! కానీ ఒక యింటికీ, మరొక యింటికీ సంబంధం లేదు. మధ్యలో కాంపౌండు గోడలూ, ఖాళీ జాగాలున్నాయి. పగిలిపోయిన యిటుకల గుట్టలూ, తెల్లగ మెరిసే యిసుకా - వీటిని దాటుకుంటూ, కాంపౌండు గేటు తెరుచుకొని వరుసలో మొదటిదైన బంగళా వరండాలో నిలబడి గట్టిగా వూపిరిపీల్చుకున్నాను. అప్పటికే గుడ్డలు సగం తడిచాయి.

వరండా చాలా బాగుంది. క్రింద అంతా మొజాక్ ఫ్లోర్. కూచోటానికి నాలుగు ఫేం బెత్తం కుర్చీలు వేయబడి వున్నాయి. పాలిష్ చేయబడిన గోడలు.

గోడలో అతికించబడిన నేమ్‌ప్లేట్, ఒక చిన్న లెటర్‌బాక్స్ - చూట్టానికి ముచ్చటగా వున్నాయి. దక్షిణంవైపు సిమెంటు జాలీలకు మాధవీలత అల్లుకునుంది. అక్కడక్కడా వుంచబడిన కుండీల్లో కాక్టస్ మొక్కలు గాలికివూగుతున్నాయి. బయట కుండపోతగా వర్షం. కొంత కూడా తెరిపినివ్వటంలేదు. తళుక్కుమని మెరిసే మెరుపులు ఆకాశాన్ని రెండుగా చీల్చుతున్నాయనిపిస్తోంది.

ఇంతలో ఒక నల్లకారు వేగంగా ఆ యింటి పోర్టికోలోకొచ్చి ఆగింది. కారు హెడ్‌లైట్స్ వెలుగుతూనే వున్నాయి. ఆ వెలుతురు నా మీద పడి అక్కడి నా అస్థిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. ఒక రాక్షసుడి గుహలో చిక్కుకున్నట్లయింది నా పరిస్థితి. కారులోంచి దిగిన మహిళ నన్ను చూడగానే ఆశ్చర్యం, ఆనందంతో "అరే! సాగర్ నీవా? ఎప్పుడొచ్చావు?" బెంగాలీలో అంటూ నా దగ్గరకొచ్చి ప్రేమతో నన్ను యింట్లోకి లాక్కెళ్ళింది.

హుందాగా కనిపించే ఆమె వయసు దాదాపు నలభై సంవత్సరాలుంటాయి. తన ఆరోగ్యాన్నీ, సౌందర్యాన్నీ జాగ్రత్తగా కాపాడుకుంటున్నట్లనిపించింది. వెలుతుర్లో ఒకరి నొకరం చూసుకున్నాం. కొన్ని క్షణాలు ఎవరమూ నోరు మెదపలేదు. నన్ను పొరపాటుగా ఆమె సాగర్ అనుకుంది. కానీ నేను సాగర్‌ను కానని ఎలా చెప్పను? ఆలోచనల్లో పడ్డాను.

"నీవేమీ మారలేదు సాగర్! ఇంతకు పూర్వం నిన్నెలా చూశానో అలాగే వున్నావ్!" అంటూ యింటి నౌకరును పిలిచి కాఫీ ఆర్డరుచేసి మళ్ళీ యిలా అంది - నీవు టీ త్రాగవు కదూ? నాకిప్పటికీ గుర్తుంది.... మంజు సంగతి ఏమైనా నీకు తెలిసిందా? రిసెర్చ్ చేస్తోంది. నాలుగైదు సంవత్సరాలైనా చూట్టానికి రాలేదు. ఈ సంవత్సరం కూడా సెలవులు రావటం, పూర్తవటం కూడా జరిగిపోయాయి. కానీ ఆ పిల్ల హృదయం ఎంత కఠినమోగానీ, కనీసం తల్లినైన నన్ను కూడా దానికి చూడాలని పించలేదు. పోనీలే బాబూ! నీవైనా చూట్టానికి వచ్చావు" ఆమె కళ్ళల్లో వుదాసీనత శూన్యంతో మాట్లాడుకుంటోంది.

నేను నోరు మూసుకుని కూర్చున్నాను. సమయం గడిచేకొద్దీ నా విషయం మరింత క్లిష్టమైపోసాగింది. బయటి వర్షం ఆగితే గానీ, నాకీ స్థితి నుండి విముక్తి లభించదు. ఏం చేయాలో, ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో పాలుపోవటంలేదు. తన ధోరణిలో ఆమె చెబుతూనే వుంది -

"ఈ మార్చిలోనే తను విదేశాలకు వెళ్ళబోతోందని మంజుకు తెలుసు. ఆవిడ నాన్నగారు, ప్రయాణానికి

సంబంధించిన ఏర్పాట్లన్నీ చేసే వుంటారు. స్వదేశంలో వుండి కూడా దానికి మమ్మల్ని చూసే తీరిక లేదు. విదేశాలకెళితే.... బాల్యంలో నీతో పాటు మంజు కూడా చక్కగా చదువుకునేది. చూసి ఆనందించేవాళ్ళం ! నీవే చెప్పు బాబూ ! చదువుకోటానికి వెళ్ళినంత మాత్రాన తనవారిని మరిచిపోతారా ఎవరైనా ? డబ్బు పంపటం ఆపుజేసి మంజును యిక్కడికి కొచ్చేట్లు చేయ గలను. కానీ కన్నతల్లిగా నేనలా చేయగలనంటావా సాగర్ ?"

వర్షం కొద్దిగా వెలిసినట్లుంది. రిస్ట్ వాచ్‌ను చూసుకుంటూ ఆమెతో యిలా అన్నాను- "చూడండీ ! నా కొకరితో అపాయింట్‌మెంటు వుంది. త్వరగా వెళ్ళాలి" అంటూ లేచాను. నాతోపాటు ఆమె కూడా వస్తూ - "ఎక్కడుంటు న్నావు ?" అనడిగింది.

"శాంతినికేతన్, విద్యాభవన్ హాస్టల్ రూమ్ నంబర్ 12" అన్నాను. ఆమేదో చెప్పాలనుకుంది. కానీ నేనా అవకాశాన్నివ్వకుండా వరండామెట్లు దిగి రెండడుగులు ముందుకు వేశాను.

వెళ్ళేవాడి నాపి ఆమె యిలా అంది- "ఈ వర్షంలో ఎలా వెళతావ్ ? సాత్ కూడీ వున్నాడు. నిన్ను హాస్టల్ వరకూ దిగబెడతాడు." అంటూ కారు డ్రైవర్ సాత్‌కూడీ వాడిని కేకేసింది. ఆదేశ పూర్వకంగా అంటున్న ఆమె మాటలకు నే నడ్డు చెప్పలేక వెళ్ళి కార్లో కూచు న్నాను. ఇంతవరకూ అంత ప్రేమతో నాతో మాట్లాడిన ఆ మహిళ, వారి కుటుంబాన్ని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి మనసులోనే వుండిపోయింది. ఈ మంజు ఎవరు ? ఎక్కడ చదువు తోంది ? ఆమె యింటికి రాకుండా పోవ టానికి కారణం ? సాగర్ ఎవరు ?" అనేక ప్రశ్నలు - చీకట్లో కారు దూసుక పోతోంది.

* * *

మరుసటి రోజు వుదయం ఎనిమిది గంటలై వుంటుంది. ఎవరో నా గది తలుపులు తట్టారు. అప్పటికింకా నేను లేవలేదు. బద్ధకంగా ఒళ్ళువిరుచుకుంటూ లేచి తలుపులు తెరిచాను. గుమ్మం ముందు ఒక వయసు మళ్ళిన వ్యక్తి నిలుచున్నాడు. అతన్ని చూడగానే, తను దేనివల్లో బాధపడుతున్నట్లుగా, ఆ బాధే ఆయన వయసును మరింత పెంచి నట్లుగ అనిపించింది నాకు. సోడాబుడ్డి లాంటి కళ్ళద్దాలలోంచి రెండుపదునైన చూపులు నన్ను పరీక్షగా చూశాయి.

"లోపలికి రావచ్చా ?" అంటూ ఆయన బలవంతంగా నవ్వాడు.

"రండి" అంటూ నేను ఆయన కూర్చోటానికి కుర్చీ సర్దాను. కుర్చీలో కూర్చుంటూ ఆయనిలా అన్నారు-

"నా భార్య నిన్ను సాగర్ అనుకొని పొరపాటు చేస్తోందని నాకు బాగా



తెలుసు బాబూ! వర్షంలో నిన్న నీవు తలదాచుకున్న బంగళా నాదే. ఆవిడ నా భార్య. ఆమే నన్ను బలవంతంగా నీ దగ్గరికి పంపింది. నీవే సాగర్‌వని నమ్ముతోంది."

"క్షమించండి! నేను సాగర్ ని కాను. నా పేరు శిల్పి. నిన్న సాయంత్రం జరిగిన సంఘటనకు సిగ్గుపడుతున్నాను. మీ శ్రీమతిగారు చూపించిన ఆప్యాయత కారణంగా నే నెందుకో నిజం చెప్పలేక పోయాను," అంటూ అపరాధిలా తల వంచుకున్నాను.

"కానీ నీలో సాగర్ పోలికలు చాల వున్నాయి బాబూ! మనిషిని పోలిన మనిషి వుంటాడని విన్నానే కానీ యిప్పుడు కళ్లారా చూస్తున్నాను. జాగ్రత్తగా పరిశీలించినా నీవు సాగర్ కాదని చెప్పుకోలేని పోలికలు నీలో వుండటం నాకూ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అందు వల్ల క్షమించమని అడిగి, సిగ్గుపడేంత

పని నీవేమీ చేయలేదు. అంతా దైవేచ్ఛ! ఒకరోజు సాగర్‌తో నా కూతురు పెళ్ళి నిశ్చయమైంది. కానీ పెళ్ళి జరుగలేదు."

ఆయన కంఠం గద్గదమైంది. మాటలు రాలేదు. కిటికీ గుండా బయటికి చూడ సాగాడు. కంఠం దగ్గర బయటికి ఎత్తుగా వచ్చినపదార్థం పైకీ-కిందికీ పెండ్యులంలా వూగటం - బహుశా ఆయన వచ్చే దుఃఖాన్ని కంఠం క్రిందే నొక్కి-పెట్ట టానికి ప్రయత్నిస్తున్నారు. నే నింతలో ఫ్లాస్క్‌లో హాస్టల్ బాయ్ తెచ్చిపెట్టిన టీని కప్పుల్లో నింపి ఆయన కొకటి అందించాను. తన బరువైన కళ్ళజోడు తీసి శుభ్రం చేసుకుంటూ టీ అందు కున్నాడు. ఆ కప్పును పెదాల దాకా తీసుకవెళుతూ యిలా అన్నాడు -

"చాలా రోజుల తర్వాత నా భార్య సంతోషపడటం చూశాను. నిన్ను చూసిన తర్వాత తన కలలు నిజమవు తున్నాయనుకుంటోంది. తను పొరపాటు చేస్తోందని తెలిసినా నేను నిజం చెప్పలేక పోతున్నాను. నిజం తెలుసుకొని నిట్టూర్చేకంటే అబద్ధంలో అరనిముష మైనా, మనిషి ఆనందించగలిగితే, వాస్తవానికి యిమడని జీవితాలు భ్రాంతిలో నైనా కొంత తృప్తిని పొందగలిగితే - కాడిగట్టిన బ్రతుకులకు అంతకంటే ఏం కావాలి? చూడు నాయనా! నా కుమారుడిలాంటి వయసు నీది. నీవు మరోలా భావించకపోతే, నేను నిన్ను 'సాగర్' అనే పిలుస్తాను. ఆమె భ్రాంతిలో జీవిస్తోంది. అదే ఆవిడకు కొంత ఆనందాన్నీ, ఆత్మశాంతినీ కలిగి స్తోంది. దాన్ని దూరంచేసే ధైర్యం నాకు లేదు. నా కుటుంబానికి నీవు "సాగర్" గానే వుండిపోవాలి. ఇది నా ప్రార్థన. లేక బిక్ష అనుకో. కాదనకు. శ్రమ అనుకోకుండా అప్పుడప్పుడూ మా యింటికి వచ్చి పోతుండాలి. నిరంతరం మమ్మల్ని తొలచివేస్తున్న ఆవేదనను నీవైనా కొంత తగ్గించగలవు బాబూ!"

జీరబోయిన కంఠంతో నన్ను అర్థిస్తూ నావైపు ఎంత దీనంగా చూశాడో, దాన్ని శబ్దాల్లో బోధించటం కష్టం!

"అలాగే! కానీ ఎంత కాలమని నిజాన్నిలా...."

"సాగినంతకాలం! అంతకంటే ప్రస్తుతం చేయగలిగిందేముంది? అది సరే! అందరూ శెలవుల కెళ్ళిపోయారు. నీవిక్కడ ఒంటరిగా...."

"ఇంటినుండి కబురు రాగానే వెళ తాను. వారం రోజులు పడుతుంది."

"మరో విన్నపం బాబూ! నీవు యింటికెళ్ళే ముందు ఒక మాట నా చెవిని పడేసి వెళ్ళు. మరచిపోకు."

"అలాగే!"

"వస్తాను. తర్వాత కలుసుకుందాం! ఇంటికి రావటం మరువకేం?" అంటూ తన తలనుండి పెద్దబరువు దిగినట్లు,

హుషారుగా నా గది గుమ్మం దాటి బజారున పడ్డాడు.

* * *

చూస్తుండగానే ఏడురోజులు గిర్రున తిరిగిపోయాయి. ఇంతలో ఇంటినుండి టెలిగ్రాం రానే వచ్చింది– "యువర్ మారేజ్ సెటిల్డ్. స్టార్ట్ ఇమ్మీడియట్లీ" అనుంది. కాబోయే అర్ధాంగి ఎలా వుంటుందోనన్న ఆలోచనలతో పెట్టే-బేడా సర్దాను. తెలియని ఆనందం– ఇంతలో మంజు తండ్రి మాటలు గుర్తొచ్చి నేను మర్నాడు వుదయం దానాపూర్ పాసింజర్‌కు కలకత్తా వెళుతున్నట్లు ఆయనకు కబురు పంపాను. భార్యా-భర్త లిద్దరూ రైల్వే స్టేషనుకు వొచ్చారు. వెనుకనుండి నా భుజాలను మృదువుగా నొక్కుతూ– "హల్లో సాగర్! దిస్ యీజ్ ఫర్ మంజూ. ఎక్స్‌క్యూజ్ మి ఫర్ ది ట్రబుల్!" అంటూ మంజూ నాన్నగారు నా కొక పాకెట్ నందించారు. పాకెట్ మీద కేవలం "టు మంజు" అని రాసుంది "మైక్"లో దానాపూర్ ప్యాసింజర్ ఇక ఐదు నిముషాల్లో బయలుదేరుతుందని హెచ్చరిస్తున్నారు. మంజు తల్లిగారు నావైపు తృప్తిగా చూడటం గమనించాను. నేను ఆమె భర్తను కొంతదూరం తీసుకెళ్ళి యిలా అడిగాను– "చూడండీ! నాకు మంజు అడ్రసు తెలియదు."

ఆయన నిర్జీవంగా ఫక్కున నవ్వుతూ బాధగా యిలా అన్నాడు– "మంజు ఎక్కడుందో నాకు కూడా తెలియదు బాబూ! నా భార్య మనసు పాడైపోయిన తర్వాత చాలాకాలం క్రితం ట్రెయిన్ ఆక్సిడెంట్‌లో మంజు చనిపోయింది. ఆ విషయం నా భార్యకు తెలియనివ్వ లేదు. ఈరోజు కూడా మంజు బ్రతికుందనే ఆమె భ్రాంతి మంజు డిగ్రీ ఫైనల్‌లో చదువుతూ, సెలవుల్లో యింటికి తను వస్తూండగా ఇది జరిగిపోయింది. మంజు రిసెర్చ్ చేస్తుందనటం, విదేశాల కెళుతోందన్న విషయం–అంతా నేను సృష్టించిందే!...."

గార్డ్ విజిల్ వూది పచ్చలాంతరును పైకెత్తాడు. నేను కంపార్ట్‌మెంటులోకెక్కి, రైలు కదిలిపోతుంటే ఆ దంపతు లిద్దరూ కనుమరుగయేంత వరకూ తలుపుల దగ్గరే నిలబడి వారిని చూస్తున్నాను. పాపం! వారిద్దరూ తమ రెండు చేతులూ వూపుతూ నాకు "టాటా" చెబుతున్నారు.

శూన్యంలో కదిలే వారి చేతుల్ని చూస్తుంటే శాపగ్రస్తమైన రెండు మట్టిబొమ్మలు 'భ్రాంతి' అనే శూన్యంలో వ్రేలాడుతూ మమ్మల్ని ఆదుకోండని చేతులు చాచి పిలుస్తున్నట్లనిపించింది నాకు.